# బీఆర్ఎస్‌కు మద్దతుగా ప్రచారం..

మియాపూర్, నవంబర్ 9 : శేరిలింగంపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి ఆరెకపూడి గాంధీకి మద్దతుగా కార్పొరేటర్లు తమ ప్రచారాన్ని మరింత ముమ్మరం చేశారు. హైదర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాస్‌రావు, ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్ గౌడ్‌లు తమ డివిజన్‌లో ఇంటింటి ప్రచారంలో పాల్గొంటూ ప్రభుత్వ పథకాలను వివరిస్తున్నారు . మరింత అభివృద్ధి కోసం బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరుతున్నారు. ఇంటింటి ప్రచారానికి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నట్లు కార్పొరేటర్లు పేర్కొన్నారు. వారి వెంట పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.



మియాపూర్ డివిజన్‌లో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ సతీమణి, ఆరెకపూడి శ్యామల, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ సతీమణి సుమలత, పార్టీ శ్రేణులు

**మహిళా సంక్షేమం కోసం విశేష కృషి...**

శేరిలింగంపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి ఆరెకపూడి గాంధీకి మద్దతుగా ఆయన భార్య ఆరెకపూడి శ్యామల, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ సతీమణి సుమలతలు పార్టీ శ్రేణులతో కలిసి మియాపూర్ డివిజన్ పరిధిలోని డైనమిక్ కాలనీ, ప్రజయ్ షెల్టర్, బుద్ధ వర్షిత్ అపార్టుమెంట్, తేజ హోమ్స్ ప్రాంతాలలో బుధవారం విస్తృతంగా ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ మహిళా పక్షపాతిగా ఉంటూ వారి సంక్షేమం కోసం విశేషంగా కృషి చేశారన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం బీఆర్ఎస్‌ను అఖండ మెజార్టీతో గెలిపించాలని వారు ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మహిళా నేతలు పాల్గొన్నారు.



ఆల్విన్ కాలనీ డివిజన్‌లో గిరిజన వృద్ధురాలికి ప్రభుత్వ పథకాల కరపత్రాన్ని ఇస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్ గౌడ్



హైదర్‌నగర్ డివిజన్‌లో ఇంటింటి ప్రచారంలో కార్పొరేటర్ నార్నె శ్రీనివాస్‌రావు

## నామినేషన్ల దాఖలుకు నేడే ఆఖరు



ఆర్వో కార్యాలయం

మియాపూర్, నవంబర్ 9 : శేరిలింగంపల్లి నియోజకవర్గ శాసన సభ్యత్వానికి ఈ నెల 30 న ఎన్నికలు జరగనున్నాయి. ఈ మేరకు నామినేషన్ల దాఖలుకు గురువారంతో గడువు ముగియనున్నది. ఇక్కడి శేరిలింగంపల్లి నియోజకవర్గ ఆర్వో కార్యాలయంలో ఈనెల 3 వ తేదీ నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం అయింది. ఆదివారం సెలవు కావటంతో నామినేషన్ల ప్రక్రియకు సెలవు. అయితే గురువారం దాఖలుకు తుది రోజు కావటంతో అధిక సంఖ్యలో నామినేషన్లు వచ్చే అవకాశం ఉన్నట్లు భావిస్తున్నారు. నామినేషన్ల దాఖలుకు చివరి రోజు ముందు వరకు బీజేపీ అభ్యర్థి ఖరారు కాకపోవటం ఆ పార్టీలో తీవ్ర ఉత్కంఠకు దారి తీసింది.

## ముగిసిన వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు

కొండాపూర్, నవంబర్ 9 : చందానగర్‌లోని విశాఖ శ్రీ శారదా పీఠ పాలిత శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం బ్రహ్మోత్సవాలు గురువారం ముగిశాయి. ఉత్సవాలలో భాగంగా ఉదయం ఉత్సవాన్నస్నపనము, విశేషపూజలు నిర్వహించారు. మధ్యాహ్నం హారతి, తీర్థ ప్రసాదములను విచ్చేసిన భక్తులకు అందజేశారు. అనంతరం పుష్పక వాహన సేవ, విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, పుష్పయాగాలను నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు బ్రహ్మోత్సవాలకు సహకరించిన ప్రతి ఒక్కరిని ఘనంగా సన్మానించారు.

## ఇంటి నుంచే ఓటుకు 376 దరఖాస్తులు

ముగిసిన గడువు

మియాపూర్, నవంబర్ 9 : ఇంటి నుంచే ఓటు వేసేందుకు వృద్ధులకు దరఖాస్తుకు గడువు పూర్తయింది. వృద్ధులు, వికలాంగులు ఇంటి నుంచే ఓటు వేసేందుకు ఎన్నికల సంఘం తొలి సారిగా ఈ ఎన్నికలలో అవకాశం కల్పించింది. అయితే ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలనుకునే వారు తప్పకుండా ఫాం 12 డీని సమర్పించాలని ఎన్నికల సంఘం సూచించింది. ఈ నేపథ్యంలో శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఓటరు జాబితా ఆధారంగా బీఎల్‌వోలు క్షేత్రస్థాయికి వెళ్లి వృద్ధులకు వికలాంగులకు ఈ అవకాశాన్ని వివరించారు. ఇందుకోసం నియోజకవర్గ వ్యాప్తంగా వృద్ధులు, వికలాంగులు నిర్ధరిత ఫాం 12 ని 376 మంది ఇవరకు సమర్పించారు. తద్వారా వీరంతా ఇంటి నుంచే తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈనెల 30 వ తేదీన పోలింగ్ జరగనుండగా...అందుకు రెండు మూడు రోజుల ముందు ప్రత్యేక అధికారుల బృందం దరఖాస్తుదారుల ఇంటికే వెళ్లి ఓటింగ్‌ను నిర్వహిస్తారు. అయితే ఓటరు జాబితా ప్రకారం 2 వేలకు పైగానే వృద్ధులున్నప్పటికీ కేవలం 376 దరఖాస్తులు వచ్చాయి. ఈఅవకాశం నిమిత్తం దరఖాస్తు గడువు ఈనెల 8 వ తేదీతో ముగిసినట్లు అధికారులు పేర్కొన్నారు.



ఓ వృద్ధురాలి నుంచి ఫాం 12డీ ని స్వీకరిస్తున్న బీఎల్‌వోలు

## సరదాగా.. ఉల్లాసంగా..

సిటీబ్యూరో, నవంబర్ 9 ( నమస్తే తెలంగాణ ) : థండర్ సాఫ్ట్ ఇండియా 5వ వార్షికోత్సవం సందర్భంగా ఆ సంస్థ ఉద్యోగుల కోసం ఘనంగా సాంస్కృతిక కార్యక్రమాలు గచ్చిబౌలిలోని శరటన్ హోటల్‌లో ఏర్పాటు చేసింది. తమ కంపెనీలో విధులు నిర్వర్తించే ఉద్యోగులు ఎల్లవేళలో ఒత్తిడి లేకుండా టీం వర్క్ స్పిరిట్ పెంపొందడమే లక్ష్యంగా వారి కోసం ఆటలు, సంగీత కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు వివరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సుధారాణి, టాటా పవర్ మైక్రోగ్రిడ్స్ కంపెనీ చైర్మన్ రామకృష్ణ సట్లూరి తదితరులు పాల్గొన్నారు.




## రేపు గిరిజనుల ఆత్మీయ సమ్మేళనం

బోడుప్పల్,నవంబర్ 9: ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో గిరిజనులకు అందుతున్న పథకాలకు కృతజ్ఞతగా ఈనెల 11న నిర్వహించే గిరిజన ప్రజాప్రతినిధుల రాష్ట్రస్థాయి ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని బోడుప్పల్ 21వ డివిజన్ కార్పొరేటర్ భూక్యసుమన్ నాయక్ గురువారం ఓ ప్రకటనలో కోరారు. ఎస్ఎన్ఆర్ పుష్ప కన్వెన్షన్ హాల్ శామీర్‌పేట్ జరిగే మా తండాలో మారాజ్యం, గిరిజనుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి బీఆర్ఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, రాష్ట్ర మంత్రులు, చైర్మన్లు, రాష్ట్ర గిరిజన ప్రతినిధులు హాజరవుతున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమానికి గిరిజనులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## 100 శాతం పోలింగ్ నమోదయ్యేలా చర్యలు చేపట్టాలి

మేడ్చల్ కలెక్టరేట్, నవంబర్ 9: ఎన్నికల సందర్భంగా ఈనెల 30న జరిగే పోలింగ్ రోజు వేతనంతో కూడిన సెలవును ప్రకటించినట్లు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఐదు నియోజకవర్గాలలోని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ,ప్రైవేటు విద్యాసంస్థలకు వేతనంతో కూడిన సెలవును ప్రకటిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు.100శాతం పోలింగ్ నమోదయ్యేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ గౌతమ్ అధికారులకు సూచించారు. జిల్లాలోని ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఓటరు స్లిప్పులను త్వరలో పంపిణీ చేస్తామని, ఫొటోతో ఉన్న ఓటరు కార్డు లేదా ఎన్నికల సంఘం నిర్దేశించిన గుర్తింపు కార్డులో ఏదైనా ఒకదాన్ని పోలింగ్ కేంద్రానికి తీసుకెళ్లాలని సూచించారు.

## 27 నామినేషన్లు దాఖలు

కీసర,నవంబర్ 9:మేడ్చల్ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి 27 నామినేషన్లు దాఖలు అయ్యాయని ఆర్డీవో రాజేశ్‌కుమార్ తెలిపారు. గురువారం కీసర ఆర్డీవో కార్యాలయంలో స్వతంత్ర అభ్యర్థులతో పాటు కాంగ్రెస్ అభ్యర్థి వజ్రేశ్‌యాదవ్ నామినేషన్‌ను ఆర్డీవోకు అందజేశారు.

## సొంతగూటికి పీఏసీఎస్ డైరెక్టర్లు



బీఆర్ఎస్‌లో చేరుతున్న పీఏసీఎస్ డైరెక్టర్ విష్ణు

శామీర్‌పేట, నవంబరు 9: శామీర్‌పేట పీఏసీఎస్ డైరెక్టర్లు జీలకరి విష్ణు, ప్రతాప్ రెడ్డి సొంత గూటికి చేరారు. కాంగ్రెస్‌లో చేరిన వారు బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చామకూర మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో తిరిగి గురువారం బీఆర్ఎస్‌లో చేశారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్ రెడ్డి, జడ్పీటీసీ సభ్యురాలు అనితాలాలయ్య, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఐలయ్య యాదవ్, శ్రీకాంత్ రెడ్డి, డైరెక్టర్‌లు భూమిరెడ్డి, బాపుసింగ్, నర్సింలు గౌడ్, బీఆర్ఎస్ మండల కార్యదర్శి అనిల్ రెడ్డి, అఫ్జల్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్య

మేడ్చల్, నవంబరు 9: ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని జరిగింది. పోలీసులు కథనం ప్రకారం.. రాజన్నసిరిసిల్ల జిల్లాకు చెందిన సంజయ్ (21) గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజినీరింగ్ చివరి సంవత్సరం చదువుతున్నాడు. బుధవారం కళాశాలకు వచ్చిన సంజయ్ కళాశాల టెర్రస్ పైకి వెళ్లాడు. అనంతరం నాలుగో అంతస్తు నుంచి దూకాడు. దీంతో తీవ్ర గాయాలపాలైన అతడిని సీఎంఆర్ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడి నుంచి సూరారం నారాయణ హాస్పటల్‌కు తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. మెరిట్ విద్యార్థి అయిన సంజయ్ ప్రేమ వ్యవహారం కారణంగా ఆత్మహత్య చేసుకున్నట్టు గుర్తించారు. విద్యార్థి మృతితో కళాశాలకు సెలవు ప్రకటించారు.



సంజయ్ (ఫైల్)